## పార్లమెంట్ ఎన్నికల ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ

భైంసా, మార్చి 29 : పార్లమెంట్ ఎన్నికల ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. కమిటీలో రమాదేవి, లోలం శ్యాంసుందర్, విలాస్ గాదేవార్, డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ సభ్యులుగా ఉన్నారు.

## చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

నిర్మల్ టౌన్, మార్చి 29 : ఆమ్మ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఈ నెల 31 నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ నాయకులకు పిలుపునిచ్చారు. నిర్మల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా పార్టీని ఎదుర్కొనలేకనే మోదీ ప్రభుత్వం కేజ్రీవాల్‌ను మద్యం కేసులో ఆరెస్టు చేసిందని మండిపడ్డారు. దీనిని కక్ష సాధింపు చర్యగా తమ పార్టీ భావిస్తున్నదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ కూటమికి తప్పకుండా ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. మోదీ ప్రభుత్వంలో ప్రజలకు న్యాయం జరుగదని తెలిపారు.

## సాయం అందించండి



బాధితురాలికి సాయం అందిస్తున్న గొట్టుముక్కుల రమణారావు

కుంటాల, మార్చి 29 : కుంటాల మండల కేంద్రానికి చెందిన వన్నెల సావిత్రి బాయి కొద్ది రోజులుగా గుండె నొప్పితో బాధపడుతున్నది. వైద్య పరీక్షల కోసం నిజామాబాద్‌లోని ఓ దవాఖానకు వెళ్లగా, గుండెకు రంధ్రం ఉందని, సర్జరీ తప్పనిసరి అని వైద్యులు చెప్పారు. చికిత్స కోసం రూ.లక్ష వరకు ఖర్చవుతుందని చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక సాయం కోరుతున్నది. దాతలు ఉంటే 70957 35988 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరుతున్నారు. ఇప్పటికి గ్రామానికి చెందిన గొట్టుముక్కుల రుమణారావు, సృజన విద్యానిలయం ప్రిన్సిపాల్ కే గంగన్న చెరో రూ.5వేల సాయం అందించారు.

## నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఖానాపూర్, మార్చి 29 : అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ఖానాపూర్ మున్సిపాలిటీలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యే చర్యలు చేపడుతున్నట్లు చైర్మన్ రాజురా సత్యం తెలిపారు. పట్టణ శివారులో శుక్రవారం డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద కొనసాగుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్ తొంటి శ్రీనివాస్, కమిషనర్ మనోహర్, ఏఈ తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు

సోన్, మార్చి 29 : సోన్ మండలం మాదాపూర్ గ్రామంలో పశు వైద్యాధికారి మహేశ్ శుక్రవారం పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. రైతులు తప్పకుండా తమ పాడి పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## నేడు సరస్వతీ శిశు మందిర్ వార్షికోత్సవం

భైంసా, మార్చి, 29 : పట్టణంలోని కిసాన్ గల్లిలో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్ 56వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భోజన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

## ఏప్రిల్ 1న వైస్ ఎంపీపీపై అవిశ్వాస పరీక్ష

సారంగాపూర్, మార్చి 29 : సారంగాపూర్ వైస్ ఎంపీపీ పతాని రాధపై ఏప్రిల్ 1న అవిశ్వాస పరీక్ష జరుగునున్నది. ఈ అవిశ్వాస పరీక్షకు హాజరు కావాలని కోరుతూ రెండు రోజుల క్రితం 13 మంది ఎంపీటీసీలకు మండల ప్రజాపరిషత్ అధికారులు నోటీసులు జారీ చేశారు. 2023, డిసెంబర్ 13న 9 మంది ఎంపీటీసీలు సంతాకాలు చేసి, వైస్ ఎంపీపీ పతాని రాధపై ఆర్డీవో రత్నకళ్యాణికి అవిశ్వాస తీర్మానం వినతి పత్రం అందజేశారు. దీనిపై వైస్ ఎంపీపీ కోర్టుకు వెళ్లడంతో అవిశ్వాస తీర్మానం వాయిదా పడింది. రెండు రోజుల క్రితం కోర్టు నుంచి ఉత్తర్వులు రావడంతో అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 1న ఎన్నిక నిర్వహించనున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన పతాని రాధ మళ్లీ వైస్ ఎంపీపీ అయ్యే అవకాశాలు మెండుగా ఎన్నాయని అందరూ అనుకుంటున్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

భైంసా, మార్చి 29 : భైంసా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీ శంకర్ ఎన్నికవగా, శుక్రవారం పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో చొండి రాజేశ్వర్, మోహన్, రావుల పోశెట్టి, తదితరులు ఉన్నారు.

## ఉరేసుకొని యువతి ఆత్మహత్య



విజయలక్ష్మి(ఫైల్)

సారంగాపూర్, మార్చి 29 : మండలంలోని శాంతినగర్‌కు చెందిన అలగొండ విజయలక్ష్మి (20) శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయలక్ష్మి బీడీ వర్కర్‌గా పనిచేసేది. ఆరేండ్ల నుంచి అనారోగ్యం పాలవడంతో చికిత్స పొందినా నయం కాలేదు. విరక్తి చెందిన విజయలక్ష్మి, శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## 'ప్రేమతో నాన్నకు'కు నంది పురస్కారం



వేణుగోపాలకృష్ణ



సుహాసిని

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 29 : నిర్మల్ ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారి వేణుగోపాలకృష్ణ స్వీయ దర్శకత్వంలో నటించిన 'ప్రేమతో నాన్నకు' ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. 3 నంది పురస్కారాలు సొంతం చేసుకున్నది. కుటుంబ విలువలు, సంస్కృతీసంప్రదాయాలను ఉన్నతంగా చిత్రీకరిస్తూ, సమాజంలోని వివిధ కోణాల్లో ఆవిష్కరించినందుకు గాను పురస్కారాలు అందుకోనున్నది. ఉత్తమ దర్శకుడిగా వేణుగోపాలకృష్ణ, ఉత్తమ నటిగా సుహాసిని ఎంపికయ్యారు. త్వరలో హైదరాబాద్‌లోని రవింద్రభారతిలో అందజేయనున్నారు.

# రైతులపై చిత్తశుద్ధేది..?

- కనిపించని మక్కల కొనుగోలు కేంద్రం..
- ప్రభుత్వ 'మద్దతు' కంటే ప్రైవేట్‌లోనే అధికం
- దళారులనే ఆశ్రయిస్తున్న రైతాంగం
- దిలావర్‌పూర్ మండలంలో 5,200 ఎకరాల్లో సాగు
- 1,97,600 క్వింటాళ్ల దిగుబడి అంచనా..



దిలావర్‌పూర్‌లో రైతులు ఆరబోసిన మక్కలు

దిలావర్‌పూర్, మార్చి 29 : 'రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం.. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు మా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, దళారులకు ధాన్యం విక్రయించవద్దు..' అని చెప్పుకునే అధికారులున్నారు. కానీ, రైతులపై ప్రభుత్వానికి చిత్రశుద్ధి కరువైంది. మద్దతు ధర ప్రకటించినప్పటికీ అది రైతులకు నచ్చలేదు. దిలావర్‌పూర్ మండలంలో ప్రభుత్వ 'మద్దతు' కంటే దళారులే అధిక ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులు వారినే ఆశ్రయిస్తున్నారు. కొన్ని చోట్ల దళారులే పంటల చేలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు.

దిలావర్‌పూర్ మండలంలోని 12 గ్రామ పంచాయతీలో అరుతడి పంటల్లో భాగంగా వేసవిలో ఎక్కువ మంది రైతులు మక్క సాగు చేస్తున్నారు. 3,800 మంది 5,200 ఎకరాలోల మక్క సాగుచేశారు. ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల చొప్పున, మొత్తం 5,200 ఎకరాల్లో 1,97,600 క్వింటాళ్ల మక్కల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అత్యధికంగా దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల్లోని అన్నదాతలు మక్క వేశారు. అయితే ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ.2,070 చొప్పున ప్రకటించింది. అయినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. కానీ, దళారులు అందుకు భిన్నంగా ప్రభుత్వ 'మద్దతు'కు అదనంగా రూ.100 నుంచి రూ.150 ఇస్తున్నారు. కాగా, ప్రభుత్వ తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సర్కారు కంటే ప్రవేటులోనే అధిక ధర ఉన్నదని అంటున్నారు.



మక్కలు తూకం వేస్తున్న కూలీలు

### ప్రభుత్వ మద్దతు ధర కంటే.. దళారుల నుంచే అధికం..

ప్రభుత్వం మక్కలకు మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలను మాత్రం ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,070 నిర్ణయించింది. 20 రోజులు క్రితం మక్కల తేమ శాతం పరిశీలించి, దళారులే క్వింటాలుకు రూ.2250 చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేశారు. ప్రసుత్తం రెండు రోజుల నుంచి మక్కలు అధికంగా రావడంతో క్వింటాల్‌కు రూ.2,150 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ మద్దతు ధర కంటే దళారుల వద్దనే అధిక ధర ఉండడంతో రైతులు అటువైపు వెళ్తున్నారు.

### పంట చెలలోనే కొనుగోళ్లు..

రైతుల వద్ద నుంచి పంట చెలలోకి వెళ్లి దళారులే మక్కలను కోనుగోలు చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.100 నుంచి రూ.150 అధికంగా ఇచ్చి మరీ కొంటున్నారు. దీంతో రైతూ సంబురపడుతున్నాడు. కానీ, రైతుల వద్ద నుంచి మక్కలు కొనుగోలు చేసి మొదటే మొసం చేసిన సందర్భాలు నిర్మల్ నియోజకవర్గంలో చాలా ఉన్నాయి. అనేక మంది రైతులు దళారులను నమ్మి మోసపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. రైతు వద్ద నుంచి నూటికి రూ.2 చొప్పున కట్ చేసి, చెక్కులను రైతులకు అందిస్తున్నారు.

### దళారుల దగ్గరనే ధర ఎక్కువ..



*ప్రభుత్వ మద్దతు ధర కంటే దళారుల వద్దనే ధర అధికంగా ఉన్నది. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఇస్తున్నామని చెప్పడమే తప్ప లాభం లేదు. ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.100 నుంచి రూ.150 వరకు అధికంగా చెల్లించి మా పంట చేలలోనే కోనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వానికి రైతులపై శ్రద్ధనే లేదు. మద్దతు ధర అని చెప్పిందే తప్ప ఇప్పటికీ కోనుగోలు కేంద్రాలు లేవు.*

**- ముత్యం రైతు, లోలం, దిలావర్‌పూర్**

# 'ఉపాధి' కూలీలకు ఊరట

- దినసరి కూలి రూ.272 నుంచి రూ.302కు పెంపు
- ఏప్రిల్ నుంచి అమలు
- సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్న అధికారులు
- దస్తురాబాద్ మండలంలో 8,273 మందికి ప్రయోజనం



ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలు

దస్తురాబాద్, మార్చి 29 : పేదలకు ఉపాధి హామీ పథకం వరంలా మారింది. స్థానికంగానే పనులు కల్పించి, ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తున్నది. కాగా, కేంద్ర ప్రభుత్వం కూలీలకు మరో తీపి కబురు అందించింది. ఈ మేరకు ప్రస్తుతం ఇస్తున్న కూలికి అదనంగా రూ.30 పెంచింది. పెరిగిన కూలి.. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు కానున్నది. ప్రస్తుతం వ్యవసాయ పనులు తక్కువగా ఉండడం, వేసవి నేపథ్యంలో మండలంలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. కాగా, ఈ పనులకు ఏప్రిల్, మే నెలల్లో ఎక్కువ మంది వెళ్తుంటారు.

దస్తురాబాద్ మండలంలో మొత్తం 4,737 జాబ్ కార్డులున్నాయి. 8,273 మంది కూలీలున్నారు. ప్రస్తుతం యాక్టివ్‌లో 4,302 జాబ్ కార్డులు ఉండగా, మొత్తం 6,312 మంది పనికి వెళ్తున్నారు. వారందరికీ పనులు కల్పించేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. గ్రామ సభల ద్వారా అవగాహన కల్పించారు. అధికారులు కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం కూలీకి రోజుకు రూ.272 చొప్పున చెల్లిస్తున్నారు. పెరిగిన వేతనంతో ఈ లెక్కన ఒక్కొక్కరికీ రోజుకు రూ.302 చొప్పున చెల్లించనున్నారు. వచ్చే ఏప్రిల్ 1వ తేదీ నుంచి రూ.30 అదనంగా చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఏపీవో రవిప్రసాద్ తెలిపారు. పనికి తగ్గ వేతనాన్ని అందిస్తున్నామని, కూలీలు ఉపాధి పనులను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

ఖానాపూర్ టౌన్, మార్చి 29 : నేరాల నియంత్రణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో శుక్రవారం ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని 3 కార్లు, 41 బైకులు, 6 ఆటోలు, టాటా ఏస్ వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణించే సమయంలో వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు లింబాద్రి, శంకర్, అరాఫత్ అలీ, కృష్ణసాగర్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### వెంకటాపూర్‌లో..

ముథోల్, మార్చి 29 : ఎస్పీ ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు ముథోల్ మండలం వెంకటాపూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జీ మల్లేశ్ మాట్లాడుతూ.. ప్రజల భద్రత కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎవరైనా అనుమానంగా సంచరిస్తే సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించార. కాగా, సరైన ధ్రువీకరణ పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని55 బైకులు, 6 ఆటోలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సాయికిరణ్, మోహన్ రావు, బాసర, లోకేశ్వరం ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఖానాపూర్ టౌన్ : పట్టుకున్న వాహనాలతో పోలీసులు



ముథోల్ : పట్టుబడ్డ వాహనాలతో సీఐ మల్లేశ్, పోలీసులు

## పోలీస్‌స్టేషన్ తనిఖీ

సోన్, మార్చి 29 : నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సీఐ శ్రీనివాస్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. వారి సమస్యలను తెలుసుకొని న్యాయం చేసేలా చూడాలన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాయికుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కార్మిక హక్కులను కాలరాసిన బీజేపీ

ఎదులాపురం, మార్చి 29 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ పదేళ్ల పాలనలో కార్మిక హక్కులను కాలరాసిందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ కార్పొరేటర్ సంస్థలకు లాభాలు వచ్చేలా కార్మిక చట్టాలు చేసిందన్నారు. ఆదాని, అంబానీల ఆస్తులు పెంచి, ఆకలి సూచిలో దేశం 111వ స్థానంలో నిలిచిందన్నారు. 104కోట్ల మంది పేదలు దారిద్రంలో ఉన్నారని ఐక్యరాజ్య సమితి పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన బీజేపీపై కనీసం కేసు నమోదు కాదు, కానీ ప్రతిపక్షాలను ఈడీతో అరెస్టులు చేయిస్తున్నదని విమర్శించారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. సమావేశం లో రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమన్న, జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేశ్, గంగన్న, వెంకటమ్మ, లింగాల చిన్నన్న, కార్యదర్శులు సుజాత, అగ్గిమల్ల స్వామి, కమిటీ సభ్యులు గంగయ్య, మామిడి స్వామి పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడులు

తాంసి, మార్చి 29 : సేంద్రియ వ్యవసాయంతోనే భూసారాన్ని కాపాడి అధిక దిగుబడులు సాధించవచ్చని దేశ్‌పాండే ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాజేందర్ అన్నారు. శుక్రవారం కప్పర్ల గ్రామానికి చెందిన రైతు గంగ్రత్ భగవాండ్లు ఏర్పాటు చేసిన వర్మి కంపోస్ట్ యూనిట్‌ను రైతులతో కలిసి క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతులు పాటిస్తూ పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులు బొజ్జ అశోక్, గంగ్రత్ అశోక్, కౌడల రాహుల్ కంపోస్టు ఎరువులతో వేసిన పంటలను వారి అనుభవాన్ని తోటిరైతులతో పంచుకున్నారు. అనంతరం రైతు గంగ్రత్ భగవాండ్లను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహేందర్, రైతులు వామన్, ప్రమోద్, రమేశ్, ఆశన్న పాల్గొన్నారు.

## యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఉచిత కోచింగ్

ఎదులాపురం, మార్చి 29 : తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీస్-2025 పరీక్ష కోసం 100 మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు మైనార్టీ జిల్లా సంక్షేమ అధికారి రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధులు, పార్సి అభ్యర్థులు ఆన్‌లైన్ http://www. tmreistelangana. cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు అన్ని రిజర్వుడ్ కేటగిరిల్లో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ హైదరాబాద్ మైనార్టీ స్టడీ సర్కిల్‌లో ఉంటుందన్నారు. మొదటి సారి ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ఏప్రిల్ 12వ తేదీ వరకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రకారం ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28వ తేదీ జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉంటుందని పేర్కొన్నారు.

## దివ్యాంగుడికి వీల్ చైర్ వితరణ

బోథ్, మార్చి 29 : గుర్రాలతండా గ్రామానికి చెందిన రఘువీర్ సింగ్ అనే యువకుడికి శుక్రవారం తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వీల్ చైర్ అందజేశారు. గతంలో సొసైటీ అధ్యక్షుడు బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ గ్రామాల పర్యటనలో భాగంగా రఘువీర్ ఇంటికి వెళ్లారు. ఇచ్చిన హామీ మేరకు వీల్ చైర్ సమకూర్చి అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేత



ప్రొజెక్టర్‌ను అందిస్తున్న విద్యార్థులు

ముథోల్, మార్చి 29 : ముథోల్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు శనివారం పదోతరగతి విద్యార్థులు రూ.40 వేల ప్రొజెక్టర్‌ను జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. చదువుకున్న పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో పాఠశాలకు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి ధర్మపురి సుదర్శన్, పాఠశాల కార్యదర్శి కంది మానాజీ, సహా కార్యదర్శి వేద పాఠక్, నిశికాంత్, ప్రధానాచార్యులు సారథి రాజు తదితరులు ఉన్నారు.

## నిర్మల్ జిల్లాస్థాయి కరాటే పోటీలు



నిర్మల్ అర్బన్ : పోటీలకు హాజరైన క్రీడాకారులు




నిర్మల్ చైన్‌గేట్ : పతకాలు సాధించిన విద్యార్థులు

నిర్మల్ అర్బన్, మార్చి 29 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో శుక్రవారం జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కరాటే పోటీలు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు శ్రీహరి రావు పాల్గొనానరు. క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ సభ్యులు తేజేందర్ సింగ్ బాటియా, భూషణ్, నాయకులు నరేశ్, నాందేడపు చిన్ను, గాజుల రవి కుమార్, కొంతం గణేశ్, ప్రశాంత్ తదితరులున్నారు.

### విద్యార్థుల ప్రతిభ

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 29 : ఖానాపూర్ మండలం బీర్నంది ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం నాగచైతన్య బంగారు, పీ శివకుమార్ కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (తెలంగాణ) ఆధ్వర్యంలో కార్యక్రమం జరగగా, విద్యార్థులకు పతకాలు అందజేశారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కోట రమేశ్, ఉపాధ్యాయులు ప్రసాద్, గంగన్న, ప్రకాశ్, సంగీత, గ్రామస్తులు అభినందించారు.

## చామన్‌పెల్లిలో ఉచిత వైద్య శిబిరం




పరీక్షలు చేస్తున్న వైద్యులు

లక్ష్మణచాంద, మార్చి 29 : సామాజిక పరివర్తన మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చామన్‌పెల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రమేశ్ రెడ్డి సూపర్ స్పెషాలిటీ దవఖాన ఆధ్వర్యంలో వైద్య బృందం ఉచితంగా పరీక్షలు చేసింది. డాక్టర్ రమేశ్ రెడ్డితో పాటు, వైద్యులు శివకుమార్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పడిగెల గంగాధర్, ఎంపీటీసీ పడిగెల అనిత, మాజీ ఉప సర్పంచ్ కొమ్మోజీ రమణ, వీడీసీ చైర్మన్ రాజారెడ్డి, దేవాదాయశాఖ కమిటీ చైర్మన్ ఏలేటి గంగారెడ్డి, కారోబారి ముత్యం, పడిగెల సురేశ్, మునబర్తి నిర్మల, రాణీ పాల్గొన్నారు.